సాక్షి రంగారెడ్డి

బుధవారం, 19, జూలై, 2023



వార్డు సభ్యుల రాజీనామా

గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు హెచ్చరించారు. 8లో▸



స్వచ్ఛందంగా చేరికలు

సంక్షేమ పథకాలకు ఆకర్శితులై స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸



పాములతో జాగ్రత్త

వర్షాకాలంలో పాముల బెడద ఎక్కువ ఉంటుంది. పశువుల విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. 8లో▸

న్యూస్‌రీల్

ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించి..

పారిశుద్ధ్య పనుల్లో మంతన్‌గౌరెల్లి సర్పంచ్



మంతన్‌గౌరెల్లిలో చెత్తను సేకరిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

యాచారం: మంతన్‌గౌరెల్లి సర్పంచ్ విజయలక్ష్మి మంగళవారం గ్రామంలో పారిశుద్ధ్యం పనుల్లో పాల్గొన్నారు. కొద్దిరోజులుగా పంచాయతీ సిబ్బంది సమ్మెతో గ్రామంలోని పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న ముసురు వర్షంతో తీవ్ర దుర్వాసన నెలకొంది. ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రహించిన సర్పంచ్ పంచాయతీ ట్రాక్టర్‌ను ఓ గ్రామస్తుడితో నడిపిస్తూ పలు కాలనీల్లో ఉన్న చెత్తను స్వయంగా తీసుకుని ట్రాక్టర్‌లో నింపారు. ఇలా పలు కాలనీల్లో చెత్తను సేకరించి గ్రామానికి దూరంగా పడేయించారు. సర్పంచే స్వయంగా ట్రాక్టర్‌లో వచ్చి చెత్తను సేకరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గెస్ట్ లెక్చరర్స్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ నియామకం కోసం ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రభు కోరారు. తెలుగు, హిస్టరీ, క్రాప్ ప్రొడక్షన్లకు ఒక్కొక్క పోస్టు, కంప్యూటర్ సైన్స్‌కు రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సంబంధిత పీజీ కోర్సులో 55 శాతం, ఎస్సీ,ఎస్టీలు 50 శాతం కలిగి ఉండాలని, బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు 94405 71781 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

120 కొత్త బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ గురుకుల పాఠశాలల్లో దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని. ఇందుకోసం కొత్తగా 120 బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. బీసీ గురుకుల పాఠశాలల్లో సీట్లు లభించక విద్యార్థులు ఆఫీసుల చుట్టు తిరుగుతున్నారని, పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం లక్షల సంఖ్యలో దరఖాస్తులు రాగా కేవలం 8 వేల మందికి మాత్రమే సీట్లు ఇచ్చారని తెలిపారు. వెంటనే 238 బీసీ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులకు అదనపు సెక్షన్లు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, సి.రాజేందర్, నర్సింహగౌడ్, రాందేవ్, భాస్కర్ ప్రజాపతి, బాసయ్య, రవి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రెండు వేర్వేరు కేసుల్లో అక్రమ బంగారం పట్టివేత



శంషాబాద్: రెండు వేర్వేరు కేసుల్లో అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం అర్ధరాత్రి కువైట్ నుంచి బయలుదేరిన ప్రయాణికుడు వయా దుబాయ్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అతడి కదలికలను అనుమానించిన కస్టమ్స్ అధికారులు క్షుణ్ణంగా లగేజీని తనిఖీ చేయడంతో 1225 గ్రాముల బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. వీటి విలువ రూ.72.55 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. అదే సమయంలో కువైట్ నుంచి వయా దోహా మీదుగా వచ్చిన మరో ప్రయాణికుడి లగేజీలో 500 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ.30.51 లక్షలుగా నిర్ధారించారు. ఈ మేరకు నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యయంపై నిఘా!



స్థానిక సంస్థలపై కేంద్రం నజర్

- నిధుల లెక్క పక్కాగా చెప్పాల్సిందే..
- అందుబాటులోకి జీఈఎం పోర్టల్
- ఖర్చుచేసే ప్రతి పైసా నమోదు చేయాల్సిందే..
- ఇప్పటికే పంచాయతీ అధికారులకు ఆదేశాలు
- అక్టోబర్ 2 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక సంస్థలపై కేంద్రం దృష్టి సారించింది. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, జిల్లా పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం నుంచి మంజూరవుతున్న నిధుల వ్యయంపై నిఘా పెట్టేందుకు రంగం సిద్ధమైంది. బ్లీచింగ్ పౌడర్, సోడియం హైపో క్లోరైడ్ ద్రావణం.. వీధిలైట్లు.. ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్లు.. ఇలా ఏ చిన్న వస్తువు కొన్నా.. ఆన్‌లైన్ వేదికగా లెక్క చూపాల్సిందేనని స్పష్టం చేసింది. ఇందుకోసం అక్టోబర్ 2 నుంచి గవర్నమెంట్ ఈ మార్కెట్ (జీఈఎం) పోర్టల్‌ను అందుబాటులోకి తేనుంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కొనుగోళ్లు ఎవరి పేరిట చేయాలో నిర్దేశించడంతో పాటు నగదు రహిత, పారదర్శక లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఈ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. స్థానిక సంస్థల్లో కొనుగోళ్ల వివరాలను ఆరాతీయడానికి కేంద్రం ఈ కొత్త విధానాన్ని తెరపైకి తీసుకొచ్చిందని ఆయా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

విచ్చలవిడి ఖర్చుకు స్వస్తి

జిల్లా వ్యాప్తంగా 558 పంచాయతీలు, 27 మండలాలు, 13 మున్సిపాలిటీలు, 3 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. ఇటీవల కేంద్రం 15 ఆర్థిక సంఘం నిధులను నేరుగా ఆయా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేస్తున్న విషయం తెలిసిందే. జనాభా ప్రాతిపదికన గ్రామ పంచాయతీల వాటా 85 శాతం, మండల పరిషత్‌లకు 10 శాతం, జిల్లా పరిషత్‌లకు ఐదు శాతం కేటాయిస్తారు. వీటిని గతంలో మాదిరిగా ఇష్టానుసారంగా బిల్లులు పెట్టి నిధులు డ్రా చేసుకునేందుకు ఎంత మాత్రం అవకాశం ఉండదు. ఈ కొత్త విధానంతో స్థానిక సంస్థల్లో నిధుల వ్యయం పూర్తిగా పారదర్శకంగా జరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు నిధుల వినియోగంపై ఎవరి పర్యవేక్షణ లేకపోవడం, అవసరం ఉన్నా.. లేకపోయినా విచ్చలవిడిగా వివిధ రకాల అవసరాలకు వ్యయం చేసినట్లు రికార్డులు సృష్టించి నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో కేంద్రం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక ప్రజా ప్రతినిధులకు మింగుడు పడటం లేదు.

పారదర్శకత ఉండేలా..

2022–23 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి రూ.46.72 కోట్లకు పైగా మంజూరు కాగా, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.38.41 కోట్లకుపైగా నిధులు మంజూరయ్యాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.3.33 కోట్లు మంజూరు కాగా, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.78.37 కోట్లకుపైగా నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను కేంద్రం నేరుగా ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమచేసింది. వీటిని జిల్లాలోని 558 గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన సర్దుబాటు చేశారు. ఈ నిధుల నుంచే పల్లె ప్రకృతి వనాలు, కంపోస్ట్ యార్డులు, వైకుంఠ ధామాల నిర్మాణం, ట్రాక్టర్లు, ట్రాలీలు, నీటి ట్యాంకర్లు, వీధిలైట్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ వంటి పనులు చేపడుతుంటారు. ఈ ఖర్చులపై నిఘా లేకపోవడంతో మెజార్టీ సర్పంచులు తమకు నచ్చినట్లు బిల్లులు రాసుకుని డ్రా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిధుల ఖర్చు విషయంలో పారదర్శకత, నగదు రహిత లావాదేవీలే లక్ష్యంగా కేంద్రం కొత్త విధానాన్ని అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు జీఈఎం పోర్టల్‌లోని సంస్థల వివరాలను పరిశీలించి వాటిలో ఏ కంపెనీ ధర తక్కువగా ఉంటే ఆ సంస్థ దగ్గర మాత్రమే వస్తువులను కొనుగోలు చేయాల్సి ఉంది. రూ.5 లక్షల కంటే ఎక్కువ విలువైన వస్తువులను బిడ్డింగ్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంది.

జిల్లాలో మొత్తం పంచాయతీలు:	558
మండల పరిషత్‌లు:	21
జిల్లా పరిషత్‌లు:	21
2021-22 ఆస్తిపన్ను వసూళ్లు:	రూ.24.23 కోట్లు
2022-23 ఆస్తిపన్ను వసూళ్లు:	రూ.26.02 కోట్లు
2023-24 రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు:	రూ.3.33 కోట్లు
2023-24 15వ ఆర్థిక సంఘం నిధులు:	రూ.78.37 కోట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

రేపటి నుంచి ఓటు హక్కుపై అవగాహన

కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఈనెల 20 (గురువారం) నుంచి వరుసగా తొంబై రోజుల పాటు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మహేశ్వరం, ఎల్బీనగర్, చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాజేంద్రనగర్‌లో ఈవీఎం గోడౌన్‌లో సమావేశమయ్యారు. ఆయా రాజకీయ పార్టీల నేతలు గుర్తించిన ఈవీఎంలను గురువారం నుంచి ఆయా గ్రామాలకు పంపించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి

అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీఎల్‌ఓలు సమర్థవంతమైన, స్పష్టమైన ఎలక్టోరల్ రోల్‌ను తయారు చేయాలని అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఫొటో ఎలక్టోరల్ రోల్స్ 2వ ఎస్ఎస్ఆర్ 2023పై బూత్ స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పారదర్శకమైన ఎన్నికల జాబితా తయారు చేయాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేయడంలో జాగ్రత్త వహించాలని అన్నారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితాను నిర్ధారించాలని, గరుడ (బీఎల్‌ఓ) యాప్‌లో వివరాల నమోదు సక్రమంగా జరిగేలా చూడాలని, పోలింగ్ స్టేషన్లను సందర్శించి అన్ని సౌకర్యాలు ఉన్నాయా చూసుకోవాలని తెలిపారు. పొలిటికల్ పార్టీ కార్యాలయాలకు 2 కి.మి దూరంలో, ఓటర్లకు సమీపంలో పోలింగ్ కేంద్రాలు ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. చనిపోయిన ఓటర్ల విషయంలో కచ్చితంగా మరణ ధ్రువీకరణ పత్రాన్ని పొంది, కుటుంబ సభ్యుల ద్వారా వాకబు చేసిన తరువాతే ఓటరు జాబితా నుంచి వివరాలను తొలగించాలన్నారు. అనాథలు, ఒంటరి, కూలీ కోసం ఊరూరా తిరిగే వారి వివరాలను సేకరించి వారి స్థిర చిరునామా ఆధారంగా ఓటరుగా నమోదు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని, పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరుగా ఉన్న ప్రతిఒక్కరి ఫొటో, వివరాలు సరిగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులు, వృద్ధుల కోసం ర్యాంపులతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న శివసేనారెడ్డి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

షాద్‌నగర్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఖదీర్ అధ్యక్షతన మంగళవారం పట్టణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శివసేనారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. యువతను మరోసారి మోసం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. విద్యార్థులు, యువకుల ఆశలను అడియాసలు చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలను సాగనంపేందుకు యువజన కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. యువతను కాంగ్రెస్ పార్టీకి మరింత చేరువ చేసేందుకు యువజన కాంగ్రెస్‌నేతలు కృషి చేయాలని, గ్రామగ్రామాన యువజన కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, గణేశ్‌రెడ్డి, అందె మోహన్, లక్ష్మణ్, శ్రీనాథ్, భాస్కర్‌గౌడ్, గణేశ్ రాథోడ్, అంజిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, జాఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అవుతాడనుకుంటే..

- కానిస్టేబుల్ పరీక్షలో ఉత్తీర్ణుడైన వరప్రసాద్
- బీరు బాటిళ్ల విషయమై కత్తిపోట్లకు గురై మృతి
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు, బంధువులు
- నిందితులను శిక్షించాలంటూ మృతదేహంతో రాస్తారోకో



ఆదివారం అర్ధరాత్రి స్వాగత్‌గ్రాండ్ వద్ద సాయి వరప్రసాద్‌పై దాడి చేస్తున్న దృశ్యం (సీసీపుటేజీ)



సాయి వరప్రసాద్

మీర్‌పేట: ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా ఉండాలని కష్టపడి చదివి పోలీసు కానిస్టేబుల్ పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు.. డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తయింది.. త్వరలో ప్రకటించే తుది జాబితాలో కుమారుడు ఎలాగైనా ఉద్యోగం సాధించి ఆసరాగా ఉంటాడనుకున్న ఆ తల్లిదండ్రులకు చివరికి శోకమే మిగిలింది. రోజంతా కళ్లముందే ఉన్న కొడుకు బయటకు వెళ్లిన కాసేపటికే తిరిగిరాని లోకాలకు చేరడంతో వారి వేదనకు అంతులేకుండా పోయింది.

ఏం జరిగిందంటే..

మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి సర్వోదయనగర్ కాలనీకి చెందిన కృష్ణ, నాగమణి దంపతులు. కృష్ణ ప్లంబర్‌గా, నాగమణి ఓ పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు సాయి వరప్రసాద్ (22) గత సంవత్సరం డిగ్రీ పూర్తి చేయగా, చిన్న కొడుకు సాయి నితిన్ ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాడు. సాయి వరప్రసాద్ ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి సంబంధించి పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు. ఆదివారం రాత్రి 12 గంటలకు తన స్నేహితుడైన సాయి యాదవ్‌తో కలిసి మద్యం తెచ్చుకునేందుకు నందనవనం వైపు వెళ్లి తిరిగి వస్తుండగా జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ వద్ద ఉన్న నితీష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, మనోహర్, కిరణ్‌తో పాటు మరికొందరు అడ్డగించారు. బీర్ బాటిళ్లు తమకు ఇవ్వాలని వారించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో నితీష్‌గౌడ్ తన వద్ద ఉన్న కత్తితో వరప్రసాద్‌పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఒవైసీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా..

మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మంగళవారం సాయంత్రం జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ చౌరస్తా వద్దకు చేరుకుని మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. వరప్రసాద్ మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు, స్థానిక నాయకులు నచ్చజెప్పినా బంధువులు భీష్మించి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి సబితారెడ్డి బంధువులతో ఫోన్‌లో మాట్లాడి మృతికి కారకులైన వారికి శిక్ష పడేలా చుస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. సంఘటనకు సంబంధించి నితీష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, మనోహర్, కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'మంత్రి కేటీఆర్ స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు. సీఎం కొడుకుననే అహంకారంతో వ్యవహరిస్తున్నారు. క్లబ్బులు, పబ్బులు అంటూ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం' అని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం నాంపల్లి గాంధీ భవన్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు సుధీర్‌రెడ్డి, గౌరి సతీష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డ్రగ్స్ కేసు విషయంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించే దమ్ము, ధైర్యం లేని మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేతపై అవాకులు, చవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు. తండ్రీకొడుకులకు రాజకీయ భిక్ష పెట్టిన రాజీవ్, సోనియాగాంధీ వారసులను కించపరిచేలా మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నేతలు షాబాద్ దర్శన్, చల్లా బాల్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం



మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: దేశంలో హరిత, క్షీర విప్లవం తేవడంతో పాటు ఎన్నో ప్రాజెక్టులు నిర్మించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ, వ్యవసాయంపై కాంగ్రెస్ పార్టీకి అవగాహన లేదని వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీని కేటీఆర్ అవహేళన చేసేలా మాట్లాడటం సరైంది కాదన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, నాడు దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, దేశంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్‌లాంటి ఎన్నో ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో నిర్మించినవేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారు బాబు, చల్లా బాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, యాదిరెడ్డి, జగన్, సురేందర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

ఎముకకు స్టెంట్ వేసిన వైద్యులు



గచ్చిబౌలి: నగర వైద్య చరిత్రలోనే తొలిసారిగా 65 ఏళ్ల మహిళకు వెన్నెముకలో స్టెంటింగ్ వేశారు. కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు. ప్రముఖ వెన్నెముక శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కృష్ణచైతన్య ఈ అరుదైన చికిత్స చేశారు. అచ్చం గుండెకు స్టెంట్ వేసినట్లే ఎముకకు సైతం మెటల్ స్టెంట్ వేయడం ద్వారా రోగికి ఊరట కల్పించారు. కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ స్పైన్ సర్జన్ డాక్టర్ కృష్ణచైతన్య మాట్లాడుతూ.. గత నెలలో ఓ మహిళ ఇంట్లో నేలపై పడిపోయింది. విపరీతంగా వెన్నునొప్పితో బాధ పడుతూ.. కనీసం నడిచే స్థితిలో లేకపోవడంతో స్థానిక వైద్యుల వద్దకు వెళ్లగా దీర్ఘకాలం విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దాంతో ఆమెకు గ్యాస్ట్రైటిస్, ఊపిరి అందకపోవడం లాంటి సమస్యలు వచ్చాయి. ఆ సమయంలో కిమ్స్ ఆస్పత్రిలోని కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ సృజన్ వద్దకు వెళ్లగా.. ఆయన తన వద్దకు పంపడంతో వెన్నెముక విరిగిన విషయం గుర్తించానని డాక్టర్ కృష్ణచైతన్య చెప్పారు. బాధితురాలికి మత్తు మందు ఇచ్చి ఆపరేషన్ చేయడం ముప్పుతో కూడుకున్నదని, సెడేషన్ మాత్రం ఇచ్చి స్టెంటింగ్ చేయాలని నిర్ణయించామన్నారు. ఆస్టియోపోరోటిక్ ఫ్రాక్చర్లు, ఇతర చిన్నపాటి సమస్యలు ఉన్న పెద్ద వయసు వారికి వెన్నెముకలోని ఎముకలు విరిగితే ఈ చికిత్స చాలా ఉపయోగకరమన్నారు. సాధారణంగా శస్త్ర చికిత్స చేసే 3– 4 గంటలు పట్టడంతో పాటు రక్తస్రావం కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. అలాంటి శస్త్ర చికిత్సల్లో అయితే స్క్రూలు బిగిస్తామన్నారు, దాని వల్ల కోలుకోవడానికి కూడా చాలా నెలలు పడుతుందన్నారు. కానీ ఈ ప్రక్రియలో స్టెంట్‌ను కేవలం ఒక చిన్న ఇంజెక్షన్ రంధ్రం ద్వారా పంపించినట్లు ఆయన తెలిపారు. ఇది లోపలకు వెళ్లి ఎముక వద్ద విస్తరిస్తుందన్నారు. దానివల్ల ఎముక తన సాధారణస్థితికి వచ్చేస్తుందన్నారు. ఎలాంటి నొప్పి కూడా లేకపోవడంతో ఆపరేషన్ అయిన కొద్ది గంటలకే రోగి లేచి నడవగలిగారని వివరించారు.

తొమ్మిదేళ్లలో చేసిందేమిటి..?



గౌరీ సతీశ్‌ను సన్మానిస్తున్న గడ్డం ప్రసాద్, కేఎల్ఆర్, షాబాద్ దర్శన్ తదితరులు

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్

మొయినాబాద్ రూరల్: తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమిటో చెప్పాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ ప్రశ్నించారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న పావని రిసార్ట్స్‌లో సోమవారం రాత్రి పీసీసీ అధికార ప్రతినిధిగా ఎన్నికైన గౌరి సతీశ్‌కు సన్మానసభ ఏర్పాటు చేశారు. పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కలను సాకారం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు పార్టీ శ్రేణులంతా కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. నక్కలపల్లి గ్రామానికి చెందిన గౌరి సతీశ్ పీసీసీ అధికార ప్రతినిధ/ గా ఎన్నికవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, నర్సింహ, బాలకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజేందర్, చంద్రశేఖర్, జనార్దన్‌రెడ్డి, ఉదయ్ మోహన్‌రెడ్డి, పెంటారెడ్డి, సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, వీరేందర్‌రెడ్డి, వెంకటయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దర్గా దర్శనానికి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

పహాడీషరీఫ్: హజ్మీర్ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్లయిన ఘటన పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వాదే ముస్తఫాకు చెందిన జావె ద్ కుటుంబంతో కలిసి హజ్మీర్ దర్గా దర్శనాని కి వెళ్లాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక నుంచి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన అరతులం బంగారు ఆ భరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.80 వేల నగదు ఎత్తుకెళ్లారు. తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు జా వెద్ కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సాయంతో ఆధా రాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

భార్య హత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

నందిగామ: మద్యం మత్తులో భార్యపై దాడి చేసి దారుణంగా హత్య చేసిన భర్తకు జిల్లా న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. నందిగామ సీఐ సురేశ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఈదులపల్లికి చెందిన ఎరుకలి నర్సింహ, విజయలక్ష్మి(35) భార్యాభర్తలు. వీరు భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. 2020 డిసెంబర్ 18న రాత్రి భిక్షాటన చేయగా వచ్చిన డబ్బుతో మద్యం సేవించాడు. ఈ విషయంలో దంపతుల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో తాగిన మైకంలో ఉన్న నర్సింహ భార్యపై కర్రతో దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. ఈ విషయమై అప్పటి సీఐ రామయ్య కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా కోర్టు జడ్జి హరికృష్ణ భూపతి మంగళవారం నిందుతుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీచేసినట్లు సీఐ సురేశ్ తెలిపారు.

డీసీఎంను ఢీకొట్టిన బైక్

వ్యక్తి మృతి

కొత్తూరు: డీసీఎంను బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన అంజయ్య(36) మండల కేంద్రంలోని ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 17న రాత్రి విధులు ముగించుకుని తన బైక్‌పై గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇన్ముల్‌నర్వ శివారులోకి రాగానే ముందు వెళ్తున్న డీసీఎం ఒక్కసారిగా నెమ్మదించింది. దీంతో వెనుక వస్తున్న బైక్ డీసీఎంను ఢీకొట్టడంతో అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. విష యం తెలుసుకున్న కుటుంబీకులు క్షతగా త్రుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరికలు


పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న చిత్తాపూర్ గ్రామస్తులు

మంచాల: బీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిత్తాపూర్‌కు చెందిన వివిధ పార్టీలకు చెందిన 20మంది కార్యకర్తలు గులాబీ గూటికి చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం పేదల అభ్యున్నతికి పనిచేస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నియోజకర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పార్టీలో కష్టపడిపని చేసే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో గండికోట చంద్రయ్య, అంజి, సుధాకర్, శ్రీను, అశోక్, రాజేశ్, శ్రీనివాస్, లింగేశ్వర్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్, ప్రధాన కార్యదర్శి బహదూర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్ నాగరాజు గౌడ్, నాయకులు దండేటికార్ రవి, పెద్దులు, కృష్ణ, వీరేశ్, మహేశ్, శివ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాములతో జాగ్రత్త



వర్షాకాలం వచ్చిందంటే సర్పాలు వాటి ఆవాసాలను విడిచి జనావాసాల్లో సంచరిస్తుంటాయి. ప్రధానంగా పొలాలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లు, గడ్డివాములు తదితర ప్రదేశాలను ఆవాసాలుగా మార్చుకుంటుంటాయి.

రైతులు , గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: వర్షాకాలంలో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. పశువులు మేత కోసం బీడు భూములు, అడవుల్లోకి వెళ్లినప్పుడు పాములు కాటేసే ప్రమాదం ఉంది. ఇలాంటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చెట్ల పొదల్లో, పంట పొలాల వద్ద పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. పశువులను మేత కోసం వదిలినప్పుడు పాములు కాటేసే రైతులు, కాపర్లు సకాలంలో గుర్తించాలి. లేదంటే అవి మృత్యువాత పడతాయి. అటవీ ప్రాంతంలో ఎక్కువగా తాచుపాము, కట్ల పాము, రక్తపింజరలు సంచరిస్తుంటాయి. ఇవి పశువుల పొదుగు, కాళ్ల దగ్గర కాటు వేస్తాయి.

రక్త పింజర కాటు వేస్తే..

పశువును రక్త పింజర కాటు వేస్తే హిమోటాక్సిన్ విడుదలై రక్త ప్రసరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో పశువుల నోరు, ముక్కుల నుంచి రక్తం కారుతుంది. పాము కాటు వేసిన దగ్గర మంటగా ఉంటుంది. కాటు వేసిన చోట వాపు వచ్చి చర్మం రంగు మారుతుంది. మూత్రం ఎరుపు రంగులో వస్తుంది. రక్తపింజర కాటు బారిన పడిన పశువులు పది గంటల లోపు మృత్యువాత పడుతాయి.

తాచు పాము, కట్లపాము కరిస్తే..

తాచుపాము, కట్లపాము పశువులను కరిచినప్పుడు న్యూరోటాక్సిన్ పశువుల శరీరంలోకి వెళ్లి నాడీ మండల వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దీంతో శ్వాసకోస వ్యవస్థ స్తంభిస్తుంది. పాము కరిచిన చోట మంట ఉండదు కాని నోటి నుంచి నురగ వస్తుంది. పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. సరైన సమయంలో చికిత్స అందించకపోతే మృతి చెందుతాయి.

ప్రథమ చికిత్స విధానం

- పాము కరిచిన చోట పైభాగాన బట్టతో గట్టిగా కట్టాలి.
- కాటేసిన దగ్గర బ్లేడుతో కోసి రక్తాన్ని పిండేయాలి
- ప్రతీ 20 నిమిషాలకు కట్టును వదులు చేసి మళ్లీ కట్టు కట్టాలి.
- పాము కరిచిన పశువుకు ఫామ్, అట్రోఫిన్ సల్ఫేట్, ఎవిల్ ఇంజక్షన్లను ఎక్కించాలి
- పశువులు కోలుకునే వరకు ఈ మందును ప్రతీ గంటకు ఒకసారి ఇస్తుండాలి
- యాంటీ బయోటిక్స్, అనాలెజిక్స్, కార్టికోస్టిరియాడ్స్, గ్లూకోజ్ లాంటి మందులు అవసరాన్ని బట్టి ఇస్తుండాలి.
- శ్వాస క్రియను ఉత్తేజం చేసేందుకు కొరమిన్, నికతాబైడ్ వంటి ఇంజక్షన్లు ఇవ్వాలి.

వెంటనే గుర్తించాలి



పశువులను పాము కరిచిన వెంటనే గుర్తించాలి. లేదంటే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ప్రథమ చికిత్స చేయడంతో విషం పైకి ఎక్కకుండా ఉంటుంది. వెంటనే పశు వైద్యుడిని సంప్రదించి చికిత్సలు చేయించాలి.

– చంద్రశేఖర్ రెడ్డి, పశు వైద్యాధికారి, రేగడి దోస్వాడ

మండలం ఏర్పాటు చేసేవరకు దీక్షలు

వార్డు సభ్యుల మూకుమ్మడి రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న గట్టుఇప్పలపల్లి వార్డు సభ్యులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల ఏర్పాటుకు వివిధ పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో 16 రోజులకు చేరాయి.

డీపీఓ, ఎంపీడీఓలకు రాజీనామా పత్రాల సమర్పణ

గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించనందుకు నిరసనగా వార్డు సభ్యులు తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు 1 నుంచి 12 వార్డుల సభ్యులు పదవులకు రాజీనామా చేసి కలెక్టర్ కార్యాలయంలో డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీకాంత్‌కు రాజీనామా పత్రాలు సమర్పించారు. మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులున్నాయని, అభివృద్ధి పరంగా గట్టుఇప్పలపల్లి అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నా మండలం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో 41 రోజులు దీక్షలు చేశామని, ప్రస్తుతం 16 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినా పట్టించుకోలేదని వాపోవారు. ప్రభుత్వం స్పందించి మండలం ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. అవసరమైతే ఆమరణ దీక్షలు చేపడతామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, డేవిడ్, గౌడ సంఘం తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, పవన్‌వాల్మీకి, దామోదర్, రేణురెడ్డి, శ్రీను, రాజీనామా చేసిన వార్డు సభ్యులు కృష్ణవేణి, రాములు, వెంకటమ్మ, సుజాతరెడ్డి, రమేశ్, నరేందర్‌గౌడ్, జోలం రమేష్, బాలస్వామి, (ఉప సర్పంచ్) ఈశ్వరమ్మ, విజయలక్ష్మి, ఏదుల మహేశ్, యాదమ్మ, నాయకులు పాల్గొన్నారు.

గురుకులాలకు నిధులివ్వండి

టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనివాస్, తదితరులు

తలకొండపల్లి: గురుకుల పాఠశాలలకు స్వంత భవనాలు నిర్మించాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. తాజా కూరగాయలతో, వేడి వేడి పదార్థలతో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని కోరారు. మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన లక్ష్మీనివాస్ నగరంలో సోమవారం రాత్రి కేంద్ర మంత్రి రాందాస్ అథావాలేను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలకు స్వంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. సరిపడా ఉపాధ్యాయులు లేక బోధన ఇబ్బందిగా మారిందన్నారు. విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నిధులు మంజూరు గురులాలకు స్వంత భవనాలుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌యాదవ్, కార్యవర్గ సభ్యులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం



అనిల్(ఫైల్)

కొత్తూరు: ఉద్యోగం రావడం లేదనే బెంగ తో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డా రు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని స్టేష న్ తిమ్మాపూర్‌లో మంగళవారం వెలుగుచూసింది. రైల్వే ఎస్ఐ అక్బ ర్ తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిలఆ పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన అనిల్(24) ఈ నెల 17న స్టేషన్ తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రాత్రి సమయంలో గుర్తుతెలియని రైలు వస్తుండగా పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పా ల్పడ్డాడు. మంగళవారం ఉదయం స్టేషన్‌మాస్టర్ కృష్ణ గమనించి రైల్వేపోలీసులకు సమాచారం ఇచ్చా రు. ఘటనా స్థలిలో లభ్యమైన ఆధార్‌కార్డు, సెల్‌ఫో న్ ఆధారంగా మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఉద్యోగం రాలేదనే మనస్థాపంతో నే ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కుటుంబీకు లు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

30న జంగమ సమాజం గ్రేటర్ ఎన్నికలు

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఇబ్రహీంపట్నం: గ్రేటర్ హైదరాబాద్ జంగమ సమాజం ఎన్నికలు ఈనెల 30న చిక్కడపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.విశ్వేశ్వరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మఠం శివకుమార్, జీహెచ్ఎంసీ కన్వీనర్ మఠం ఎర్రిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ జంగమ స మాజం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారికి మాత్రమే ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరి ంచారు. ఈ నెల 20 నుంచి 23న మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల స్వీకరణ, తదుపరి పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ ఉంటుదని చెప్పా రు. 30న పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తామని చెప్పారు. జీహెచ్ఎంపీ పరిధిలో ఆధార్ కార్డు ఉన్న ప్రతీ జంగమయ్య తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

శంషాబాద్ రూరల్: సిమెంటు ఇటుకలు తయారు చేసే యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహ్మద్ అజీం పాల్మాకుల ప్రాంతంలో సిమెంటు ఇటుక, రింగు తయారీ యూనిట్ నడుపుతున్నాడు. ఇందులో పని చేసేందుకు రెండు నెలల కిందట ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహిల్(20) అనే యువకుడిని పనికి పెట్టుకున్నాడు. కూలీల కోసం అజీం ఈ నెల 1న ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి యూనిట్ వద్ద రాహిల్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పనికి వెళ్లిన మేస్త్రీ

పని కోసం ఇంటి నుంచి వెళ్లిన మేస్త్రీ అదృశ్యమయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలో టి.రాజు(30) మేస్త్రీ పని చేస్తుంటాడు. ఈ నెల 16న పని కోసం ఇంటి నుంచి బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని భార్య విజయ మంగళవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన తల్లీపిల్లలు క్షేమం

- భార్యాభర్తల మధ్య గొడవే కారణం
- దంపతులకు పోలీసుల కౌన్సెలింగ్



దంపతులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కడ్తాల్: ఈ నెల 12న అదృశ్యమైన తల్లీపిల్లలు క్షేమంగా ఇంటికి చేరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లికి చెందిన బన్నె దివ్య తన ఇద్దరు కుమారులతో అదృశ్యమైన ఘటన పాఠకులకు విదితమే. ఈ మేరకు ఆమె భర్త చంద్రశేఖర్ ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉండగా సదరు మహిళ మంగళవారం ఉదయం విఠాయిపల్లిలో తన నివాసానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రెడ్డి అక్కడకు చేరుకుని విచారించగా భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా శ్రీకాకుళంలోని తన తల్లిగారింటికి వెళ్లినట్లు చెప్పింది. ఈమేరకు పోలీసులు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గంధపు చెక్కల విక్రేతల అరెస్టు

రాజేంద్రనగర్: గంధపు చెక్కలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వృద్ధులతో పాటు ఓ యువకుడిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 20 కిలోల గంధపు చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మిగూడకు చెందిన యాదగిరి, శ్రీనివాస్, ఫజల్‌ల వద్ద గంధపు చెక్కలు ఉన్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకొని 20 కిలోల గంధపు చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడ నుంచి తెచ్చారు, ఎవరికి విక్రయించారు తదితర వాటిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పండుగకు ఇంటికొచ్చి..

పేడ కోసం వెళ్లి వివాహిత మృతి

శంషాబాద్: పండుగ నిమిత్తం తల్లిగారింటికి వచ్చిన వివాహిత రైలు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. కాచిగూడ రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌లో నివాసముంటున్న యమున (23) బోనాల పండగ కోసం తొండుపల్లిలో ఉండే తల్లి ఇంటికి రెండురోజుల కిందట వచ్చింది. పండగ సమయంలో వాకిట్లో కల్లాపి చల్లేందుకని పేడ తెచ్చేందుకు పక్కనే ఉన్న రైల్వే పట్టాలు దాటి వెళ్లి పేడ తీసు కుని పట్టాలు దాటుతుండగా యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొనడంతో మృతి చెందింది.

జీఎంఆర్ కార్గో ద్వారా పూణేకు రోడ్డు ఫీడర్

శంషాబాద్: పూణే– హైదరాబాద్ మధ్య ఎగుమతి, దిగుమతి సౌకర్యాన్ని మరింత పెంపొందించేందుకు జీఎంఆర్ కార్గో రోడ్డు రవాణా సర్వీసు ప్రారంభించినట్లు వెల్లడించింది. ఎనిమిదికి పైగా పారిశ్రామిక ప్రాంతాలను కలిగిన పూణేకు 5600 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ట్రక్కులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇవి కేవలం 11 గంటల సమయంలో జీఎంఆర్ కార్గో నుంచి పూణేలోని పింప్రి, చించ్‌వాడ్ చాకన్, భోసారి, రాజ్‌నంగ్‌గావ్, హడస్పార్, షిర్వాల్, షిక్రపూర్ వూడే పారిశ్రామికవాడలకు చేరుకుంటాయన్నారు. ఈ సర్వీసులతో ఫార్మా, ఆటోమొబైల్, ఇంజనీరింగ్ తదితర వాణిజ్యరంగాల వ్యాపారాభివృద్ధి తోడ్పడుతుందన్నారు.